# సోదరి క్షేమం

**త**నకూ, సుభద్రకూ పెళ్ళయినట్టే భావించుకుంటూ వస్తున్నాడు శోభనాద్రి. వెధవది మనలో ఎంగేజిమెంటంటూ ఉండకపోబట్టి కాని, తనూ సుభద్రా పెళ్ళి కావటానికి ఎంగేజి అయివున్న వాళ్ళలో లెక్కే మరి!

"నన్ను పెళ్ళాడతావా!" అని శోభనాద్రి నోరు చేసుకుని సుభద్ర నింకా అడగలేదనుకోండి. ఐనా తను అడగటానికి రూఢి చేసుకున్నట్టుగా, తను అడగటం వ్యవధిగా సుభద్ర "ఎప్పుడు మన పెళ్ళి" అంటుందనే విషయంకూడా రూఢేనాయెను.

ఎంచేతనంటే తను సుభద్ర నెంతగా ప్రేమిస్తున్నదీ ఆమెకు తెలుసునని తనకు తెలుసు. లేకపోతే తన సాటి కుర్రవాళ్ళెవరితోనూ నిలబడి క్షణం మాటలాడటానికి ఒప్పుకోని సుభద్ర తనతో గంటల తరబడి ఉత్సాహంగా ఎందుకు మాటలాడుతుందీ? తన అన్నల వెంట కూడా బయటికి షికారు వెళ్ళని మనిషి, తన వెంట సినిమా కెందుకు బయల్దేరుతుందీ? తన సొంత పనులు చేసుకోవటంలో బద్ధకించే మనిషి, తనకు మంచినీళ్ళో, వక్కపొడో కావాలంటే చివాలున ఎందుకు లేస్తుందీ?

తనను పెళ్ళాడమని సుభద్రను తనడగటమెంత తథ్యమో, ఆమె ఒప్పుకోవడమూ తథ్యమే. కాకపోతే తను నోరు చేసుకుని ఆ మాట పైకనటం అట్టే ఉండిపోయింది. పోతేనేం? ఒకసారి తమ వివాహం స్థిరమయిందో తమ మధ్య వున్న ఈ ఉత్సాహమూ, స్వేచ్ఛా సన్నగిల్లుతై. నా క్కాబోయే భార్యా, నా క్కాబోయే భర్తా అనే ఆలోచనలు మాటి మాటికీ అడ్డొచ్చి తమని తాము మరిచిపోలేకుండా చెయ్యటం జరుగుతుంది. ఎందుకొచ్చింది, ఇంకా ఆర్నెల్లు. ఈ మార్చితో తన డాక్టరు చదువూ, సుభద్ర ఇంటర్ చదువూ రెండూ పూర్తయిపోతై. ఈ ఆర్నెల్లూ ఓపికపడితే అప్పుడే పెళ్ళి సెటిల్‌చేసి, వెంటనే ముహూర్తం ఏర్పాటు చేసుకోవచ్చు. అందాకా – ఈ ఆర్నెల్లూ – ఈ అవ్యాజానందం అవిచ్ఛిన్నంగా పొందుతూ ఉండొచ్చు.

ఈ అవ్యాజానందంలో ఓ భాగం వార ఫలితాలు తెలుసుకోవటంగా ఉంటూ వస్తున్నది. ఓ నెల్లాళ్ళ క్రితం ఓ వింత సంగతి బయటపడింది. సుభద్రదీ ఒకేతులా

లగ్నం - జన్మనక్షత్రం ఓటికాదు గాని, లగ్నం ఫలితాలు చూసుకునేప్పుడు తమరిద్దరూ కలిసే చూసుకోవచ్చు. అవి ఎట్లా ఫలించిందీ కూడ కనుక్కోవచ్చు.

జోస్యమూ, ప్రశ్నలూ, సంవత్సర, మాస, వార ఫలితాలూ - ఇదంతా వొట్టి మూఢ నమ్మకమని తాను అదివరలో ఘంటాపథంగా చెప్పినవాడే, వాటిల్లో విశ్వాసం ఉన్న వాళ్ళతో పోట్లాడినవాడే, కాని ఇప్పుడు తల్చుకుంటే ఆ రోజుల్లో తను నాగరికత లేకుండా ప్రవర్తించినట్టుగా కనిపించేది. ఈ మూఢ విశ్వాసం విషయంలో సుభద్ర, శోభనాద్రికి నాగరికత నేర్పింది. ఆమె వైఖరి ఏమంటే ఆమెకు జోస్యంలో నమ్మకం లేనట్టు ఉండేది. ఉన్నట్టూ ఉండేది. జోస్యంలో పూర్తి నమ్మకం కలవాళ్ళ మీద ఎగిరిపడ్డట్టుగా శోభనాద్రి సుభద్రమీద ఎగిరి పళ్ళేకపోయినాడు. ఎట్లాగయినా నాగరికత గొప్ప పదార్థం! శోభనాద్రి కూడా సుభద్ర నాగరికత అవలంబించి జోస్యంలో ప్రత్యేకించి వార ఫలితాలలో విశ్వాసం ఉందో లేదో తెలీనీకుండా ప్రవర్తించసాగాడు.

వార ఫలితాలతో చిక్కేమిటంటే అవి దబ్బున రుజువు కావు. సిద్ధహస్తుడైన హంతకుడి దుర్మార్గ మార్గమల్లే వాటిని కష్టపడి రుజువు చెయ్యాలి. అటువంటి హంతకుణ్ని పట్టుకునే పత్తేదారు కిచ్చినట్టు వాటికి, నిజం కావటానికి, చాలా టైమివ్వాలి. వార ఫలితాలలో ఆసక్తి తెచ్చి పెట్టుకోటం ఒక శిల్పమని చెప్పొచ్చు.

ఆ శిల్పాన్ని శోభనాద్రి కష్టపడి సంపాదించాడు. సుభద్ర అతనికీ విషయంలో చాలా సహాయకారి అయింది. అదంతా చాలా బాగానేవుందిగాని శోభనాద్రికిప్పుడు కొత్తగా ఒక సమస్య ఏర్పడింది. నాగరికత ఉందీ లేందీ పైకి తెలీరానీకుండా ప్రవర్తించటం తేలికేగాని అందులో నమ్మకం ఉండీ లేని స్థితిలో ఉండటం కష్టం. "నీకు జోస్యం పిచ్చి ఉన్నట్టా, లేనట్టా? ఎటో ఓ అటు తేలి చావ్వేం?" అని నీలో ఉన్న ప్రోలిటేరియన్ అంతరాత్మ నిలదీసి అడుగుతుంది.

దానికి సమాధానం చెప్పాలిసొస్తే శోభనాద్రి చిక్కున పడ్డాడు. జోస్యం పిచ్చిలేకపోతే ప్రతిసారి వార ఫలితాలు చూడటం దేనికి? అయితే మరి తనకు జోస్యం పిచ్చివుందా? ఈ వారఫలితాలు పొరపాటునైనా నిజమయి యాడవ్వు. ఎట్లా?

ఆడది కావటం వల్లనో ఏమో సుభద్రకీ ఇబ్బంది లేకపోయింది. ఆమె ప్రతివారమూ అధమం రెండు పత్రికల్లో వారఫలితాలు చూసేది. అవి తనకు మంచి సూచిస్తే నిర్లిప్తంగా సంతోషం కనబరిచేది. కష్టం సూచిస్తే ఉత్సాహంగా విచారపడేది. చివరకు వారాంతానికి ఈ జోస్యం నిజమయిందా లేదా అని చూసుకునేదికాదు. ఇంకా శోభనాద్రే, దారితప్పి తనకు సంబంధించిన జోస్యం నిజమైనప్పుడు, నలుగురితోనూ ఆశ్చర్యంగా చెప్పుకునేవాడు... ఒక్కోసారి అతనికికష్టమేసేది - తను సుభద్రకోసం ఈ పిచ్చి జోస్యంలో ఆసక్తి

తెచ్చిపెట్టుకోవటమేమిటి, ఆమెకు అందులో తనకున్నంత ఆసక్తి కూడా లేనట్టు కనిపించటమేమిటి?

ఒకానొక పత్రిక ఆ వారపు తులాలగ్న ఫలితాలను ఈ విధంగా ప్రకటించింది.

"మిమ్ము ప్రేమించేవారికి మీ హృదయం అర్థమయిందా లేదా అనే బాధ మిమ్ము వేధిస్తూయుండును. ఈ వారములో మీరు మీ స్నేహితులను, మీ స్నేహితులు మిమ్ములను బాగుగా యర్థము చేసికొందురు. 16 ఉత్సాహం, 17 తలవని తలంపుగా చిన్న ప్రయాణం, 19, 20 ప్రణయానుభవం, 21 విచారము, స్వల్ప ప్రయాస."

15 తేదీన శోభనాద్రీ, సుభద్రా ఈ ఫలితాలు కలిసి చదువుకున్నారు. సుభద్ర మనస్సులో ఏమేమి ఆలోచనలు కలిగిందీ శోభనాద్రి ఎరుగడు. కాని అతని మనస్సు మాత్రం పగ్గాలు తెంచుకుని పరుగెత్తి పోసాగింది. ఈ వారంలో తన ప్రేమ కథ మొగ్గ తొడుగుతుందా ఏం? నిజంగా 20, 21 తేదీలలో తనకూ సుభద్రకూ ప్రణయానుభవం రాసి పెట్టి ఉందా? ఆమెను పెళ్ళి చేసుకుని సంసార పక్షంగా, లోక విద్ధారం ఏమీలేకుండా ఆనందం పొందటానికి మాత్రమే కలలు గంటూండిన శోభనాద్రికి సుభద్రతో ప్రణయానుభవం ఆలోచన కలిగితేనే మతి పోయినట్టయింది. అమాంతం అక్కడే సుభద్రను తన రొమ్ముకేసి అదిమేసుకుందామనుకున్నాడు. కాని 20వ తేదీ దాకా ఆగటం ఎందుకైనా మంచిదనిపించింది. ఆర్నెల్లు ఆగటానికి తయారైన శోభనాద్రికి 20వ తేదీ చాలా దూరాన ఉన్నదే అనిపించింది. ఈ నాలుగు రోజులూ ఎట్లా గడుస్తాయో అతనికి బోధపళ్లేదు....

తన మనస్సులో ఏ ఆలోచనలు రేగుతున్నదీ సుభద్ర చెప్పేస్తే ఎంత బాగుణ్ణు! మనుష్యులట్లా హృదయాలు విప్పుకోరెంచేతనో? వెధవ గోడలు! ఆ గోడలుంటే గాని ప్రపంచం వెళ్ళదు గామాలు?

తనకు జోస్యం మీద అఫీషియల్‌గా నమ్మకం లేదనే విషయం కూడా అప్పట్లో శోభనాద్రికి జ్ఞాపకం రాలేదు. ఆ వారపు లగ్న ఫలితాలతని ప్రాణానికి జోస్యం మాదిరిగా లేవు – గట్టిగా రుజువయి త్వరలో ప్రత్యక్షం చెయ్యబడనున్న పూర్వ చరిత్రగా తోచింది.

మర్నాడు నిజంగానే ఉత్సాహంగా గడిచింది శోభనాద్రికి. మామూలుగానే అసలు కొంటెది, ఆనాడు సుభద్ర అల్లరిలో చెలరేగిపోయింది. మాటల సందర్భంలో వచ్చిన ప్రతి మనిషినీ వెక్కిరించింది. అందరి నడకలూ నడిచి చూపించింది. మంచి ఉషారు మీద ఉన్న కోతిలాగా ప్రవర్తించింది. అదంతా శోభనాద్రికి చెప్పరాని ఆనందం కలిగించింది.

సుభద్రను కొంచెం ఏడిపిద్దామనే సదుద్దేశంతో శోభనాద్రి 'ఇరవయ్యో తారీకెప్పుడొస్తుందా అని చూస్తున్నా' అన్నాడు.

"ఏం పందొమ్మిదో తారీఖు వెళ్ళగానే వస్తుంది... ఏం? దానికోసం అంత ఎదురు చూడాలిసిన పనేమిటి?" అంది సుభద్ర.

"ఉందిలే... ఒకసారి లగ్న ఫలాలు చూడు."

"పాపం అలవాటైన ప్రాణం కనక తహతహలాడిపోతున్నది!" అన్నది సుభద్ర.

"ఇంకేం? తెలిసేనా అడిగావ్?.... నా ప్రాణం తహతహ లాడిపోతున్నదని చెప్పటం దేనికి? నీదో? నీ ప్రాణం తహ తహ లాట్టంలా?" అన్నాడు శోభనాద్రి చొరవగా.

"అబ్బో! మీరు చూశారు గాబోలు!" అన్నది సుభద్ర.

మొత్తానికి పదహారో తేదీ వార ఫలితాల ప్రకారం వెళ్ళిపోయింది. రేపు తలవని తలంపుగా చిన్న ప్రయాణం. ప్రయాణం తనకూ, సుభద్రకీ కలిసే తగలాలి. ఎక్కడి కవుతుందో? ఏ పిక్నిక్ మీదనన్నా వెళ్ళితే బాగుండును. అటువంటి చోటే ప్రణయానుభవం కూడా వుండవలసినట్టుంటుంది.

మర్నాడు పదిహేడో తేదీనాడు శోభనాద్రికో ఉత్తరం వచ్చింది. అతని చెల్లెలు నాలుగు రోజుల్నుంచీ జబ్బుగా మంచాన పడి ఉన్నది. నాటు వైద్యుడు సన్నిపాతమని చెప్పాడు. శోభనాద్రి ఒకసారి వచ్చి చూసి పోవలసిందని ఉత్తరం.

వార ఫలితాల మహత్తును గురించి విస్మయపడటానికి బదులు శోభనాద్రి ఉత్తరం చూసి కంగారుపడి పోయినాడు. అతనికి చెల్లెలంటే పంచ ప్రాణాలూను. ఆ పిల్లమీద తనకున్న గాఢమైన మమకారంలో నూరోవంతైనా ప్రకటించే అవకాశం దొరక్క పోవటం గురించి ఆలోచన వచ్చినప్పుడల్లా అతని మనస్సు చివుక్కుమనేది.

ఇప్పుడీ ఉత్తరం చూడగానే శోభనాద్రికి తన చెల్లెలు పోతుందేమోననే భయం పట్టుకుంది. టైఫాయిడ్ గురించి విద్యా విహీనులకన్న అతనికి జాస్తిగా తెలిసుండటం మరింత భయ కారణమయింది. ఇంగ్లీషు వైద్యంలో ఆ దిక్కుమాలిన జబ్బుకు మందు లేదు. నాటు వైద్యులు సన్నిపాతాన్ని నయం చేసినట్టు కొన్ని దాఖలాలున్నప్పటికీ దానంతట నయంగాని సన్నిపాతాన్ని ఏ వైద్యుడూ నయంచెయ్యలేడని అతనికి తెలుసు.

చెల్లెలిగారూరు వెళ్ళటానికి సన్నాహమంతా చేసుకున్నాక ఈ విషయం సుభద్రతో చెప్పాలనే ఆలోచన కలిగింది శోభనాద్రికి. అతను వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి, అప్పుడే ఒక గంట క్రితం, సుభద్ర అర్జంటుగా వాళ్ళ పిన్నిగారూరు బయలుదేరినట్లు తెలిసింది. సుభద్ర పినతల్లి కిందటి రోజే ప్రసవం అయింది. ఆమె భర్త ఏవో సరుకులూ, సామానులూ కొనటానికి వచ్చి సుభద్రను వెంటబెట్టుకెళ్ళాడు.

"చిత్రం!" అనుకున్నాడు శోభనాద్రి.

చెల్లెల్ని చూసిన మీదట శోభనాద్రి ఆదుర్దా చాలా తగ్గింది. అతననుకున్నంత ప్రమాదంగా లేదామెకు. నాటు వైద్యుడే మందిస్తున్నాడు. శోభనాద్రి కూడా ఒక వైద్యుడేనని తెలిసిన మీదట కూడా ఆ నాటు వైద్యుడు "ఈ రోగి నాది, నీ పటాటోపం చూస్తే నాకేమీ భయం లేదు. నీ కసలు నాటేమిటో ఏం తెలుసులే?" అన్న వైఖరి అవలంబించాడు.

శోభనాద్రికి వైద్యుణ్ణి చూస్తే కోపం రాలేదు. రోగిలో దుర్లక్షణాలేమీ లేకుండా పట్టుకొస్తున్నందుకు గౌరవం కూడా కలిగింది.

తన చెల్లెలు ఆడబిడ్డ కొంత కాలంనించీ ఇక్కడే ఉంటున్నది. ఆ అమ్మాయి పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళది. ఆమెను శోభనాద్రి అదివరలో ఒక్కసారి మాత్రమే చూశాడు. కాని ఆమెను గురించి అదివరకే అంతా తెలుసుకున్నాడు.

ఆ అమ్మాయి పేరు జయలక్ష్మి. ఆమె చాలా నాసిరకం. ఒకడి భార్యగా ఉండటానికి బొత్తిగా పనికిరానిది. కొంతమందికి సంగీతం పాడటం బొత్తిగా రానట్టు, ఆమెకు నీతిగా ఉండటం బొత్తిగా చాతకాదు. తేనె మీద ఈగలు వాలకుండా చెయ్యటం ఎంత కష్టమో ఆమె ఇతర మొగవాళ్ళ మీద పడకుండా చెయ్యటం అంత కష్టం.

పోనీ ఆ మనిషికి తాత్కాలికంగానైనా మగవాణ్ణి ప్రేమించే శక్తి ఉందా అంటే అదీ లేదు! ఇంకో ప్రాణిని ప్రేమించటానికి ప్రయత్నించాలనే ఆలోచన కూడా ఆమెకు లేదు.

ఇంకో వింత ఏమిటంటే ఆమెకు ఆత్మ క్షేమమైనా తెలీదు. అందుచేత ఆమె తను చేసే రంకు ప్రయత్నాలు చాటుగా చెయ్యటానికి ప్రయత్నించక ప్రతిసారీ మొగుడికో, అత్తగారికో దొరికిపొయ్యేది. ఆమెను భర్త ఒకసారి వెళ్ళగొట్టి, మళ్ళీ తెచ్చుకుని, మళ్ళీ వెళ్ళగొట్టాడు. ఆమెను దగ్గిరికి తీసి చూసిన అక్కలూ, అన్నలూ, అంతా చివరికామెను వెళ్ళగొట్టారు. ఇప్పుడు శోభనాద్రి బావమరిది వంతు. ఈ మనిషి ఇక్కడ మాత్రం ఎంతకాలం ఉంటుందో శోభనాద్రి ఊహించలేకపోయినాడు.

శోభనాద్రి జయలక్ష్మిని అదివరకే మనస్ఫూర్తిగా అసహ్యించుకున్నాడు. ఎదురుగా మనిషిని చూస్తే ఆ అసహ్యం రెట్టింపయింది. ఆ మనిషి చరిత్ర యావత్తు ఆమె మొహాన తాండవిస్తున్నది.

"బాల్య వివాహాలు చేసుకునేవాళ్లు ఇటువంటి పెళ్ళాం దొరక్కుండా తమను తామెట్లా కాపాడుకోగలరు?" అనుకున్నాడు శోభనాద్రి.

ఒక రోజు గడిచింది. జయలక్ష్మి తన మీద ఒక కన్నువేసి ఉంచినట్టు శోభనాద్రికి రూఢి అయింది. జూలో పాములుండే అరల్లో కప్పలు కూడా ఉంటై. ఆ పాములను గురించి ఆ కప్పల కెటువంటి అభిప్రాయం ఉండదగునో శోభనాద్రి కటువంటి భావం కలిగింది.

కాని ఆ భావం వెనకాలే జయలక్ష్మిని ఏమైనా చెయ్యాలనే ఉద్రేకం తన అంతరంగంలో కరుడు కట్టుకుని ఉండటం గ్రహించి శోభనాద్రి ఆశ్చర్య పోయినాడు. జయలక్ష్మి అంటే తనకు వర్ణించరానంత అసహ్యం. ఆమె మీద తనకు ప్రేమ కాదు కదా మోహమైనా లేదు. మోహం లేని కామంతో ఆమెను హింసించాలని అతనిలో ఒక ప్రోద్బలం

బయలుదేరింది. ఆలోచిస్తే అందులోనూ అర్థం కనిపించలేదు. ఎందుకంటే ఆమె ద్వారా కామతృష్ణ తీర్చుకోవటం ఆమెకు శిక్షే కాదు. అయినా అతని కామం పగ మాదిరిగానే ఉంది.

ఇంకొకందుక్కూడా శోభనాద్రి ఆశ్చర్యపోయినాడు. సుభద్ర వంటి దేవతను అరచేతిలో పెట్టుకుని, తనకిటువంటి పశువును గురించి ఆలోచించవలసిన అవసరమేమిటి? తన సంస్కారంలో ఏదో పెద్ద లోటున్నదా? సుభద్రను ఆరాధించే శోభనాద్రి, జయలక్ష్మిని ద్వేషం ద్వారా కామించగలడా?

ఎంత ఆత్మ పరీక్ష చేసుకున్నా, ఎంత ఆత్మబోధ చేసుకున్నా అతని కామం అరికట్టక సన్నిపాత రోగి జ్వరం లాగా క్షణ క్షణ ప్రవర్ధమానమవుతున్నది.

పద్దెనిమిదో తారీఖు రాత్రి అతనికి నిద్ర పట్టనేలేదు. ఆ దిక్కుమాలిన జంతువు జయలక్ష్మితో పోతేగాని తన జీవిత రైలు ముందుకొక్క అడుగైనా దొర్లేట్టు లేదు. అయిదారుసార్లు శోభనాద్రి పక్కమీదినుంచి లేచాడు. జయలక్ష్మి దగ్గిరికి పోదామనే సంకల్పంతో. ఒకసారి జయలక్ష్మి పడుకున్న చోటికి వెళ్ళి ఆమెకేసి ఎంతో తృష్ణతో చూసి తిరిగి వచ్చాడు కూడాను. ఏం చెయ్యటానికీ ధైర్యం చాలలేదు.

తిరిగి వచ్చి పడుకుని ఆలోచించాడు. సుభద్ర విషయంలో అంత నిగ్రహం చూపగలిగిన తనకు ఈ జయలక్ష్మి విషయంలో ఇంత నిగ్రహం లేకుండా పోవటానికేమిటి కారణం? ఇవాళ ఈ జయలక్ష్మి సన్నిపాతం తగిలి చస్తే రేపటికి రెండూ! తనకేమీ చింతలేదు. అటువంటప్పుడు ఈ మనిషికోసం ఇంత తపించటం దేనికి? తన తాలూకు నగ్న సత్యం ఈ జయలక్ష్మిగాని, సుభద్ర కాదనుకోవాలా?....

ఏ రెండు గంటలకో అతనికి నిద్ర పట్టింది. మర్నాడుదయం నిద్రలేచి శోభనాద్రి తనను తాను మనస్ఫూర్తిగా ద్వేషించుకున్నాడు. నిద్దట్లో కూడా అతని కామానికెటువంటి మార్పూ కలగలేదు. ఎంతసేపటికీ అయిపోని ఛండాలపు సినిమా చూస్తున్న వాడి మనస్తత్వంతో అతను బాధ పడసాగాడు.

ఆ రోజు మధ్యాహ్నం వేళ జయలక్ష్మి వంటింట్లో అతనికి ఒంటరిగా దొరికింది. అతని బావమరది ఎక్కడికో వెళ్ళాడు. రోగి నిద్రపోతున్నది.

"బాగానే వుంది!" అన్నది జయలక్ష్మి నిర్వికారంగా, అతనామెను పట్టుకోగానే. ఒక మగవాడు తనను పట్టుకున్నప్పుడు ఆడది ఇష్టమైనా ప్రకటించాలి, కోపమైనా ప్రకటించాలి. జయలక్ష్మి "బాగానే ఉంది" అన్నదేగాని అతని పట్టు విడిపించుకోవటానికి ప్రయత్నించలేదు.

శోభనాద్రికి జయలక్ష్మిని గురించి కనువిప్పు కావలసిన అవసరం ఏమైనా ఉంటే

అది కూడా ఇప్పుడయింది. కామతృప్తి నిజంగా తుచ్ఛమైనది కాదు. దాని ద్వారా హృదయాలకు వన్నె హెచ్చుతుంది. అది స్త్రీ పురుషులకు కలిగించే పారస్పర్యం మరే విధంగానూ దొరకదు.

కాని ఈ విధంగా జయలక్ష్మికి తను ఏ మాత్రమూ సన్నిహితుడు కాలేకపోయినాడు. ఇంతకంటె అస్పృశ్యమైన కామ సంతృప్తి అతను ఊహించలేక పోయినాడు. జయలక్ష్మి ఆ క్షణంలోనన్నా చీమ తలకాయంత ఆనందం గాని, తన మీద ఆఖరికి అతిక్షణ భంగురమైన ప్రేమ భావం గాని కనబరచినట్టయితే ఆమెను క్షమించి ఆమెను గురించి తనకున్న అభిప్రాయం యావత్తూ మార్చుకోవటానికి శోభనాద్రి సిద్ధపడ్డాడు. కాని జయలక్ష్మి అతనికా శ్రమ ఇవ్వలేదు.

"నాలో నిజంగా ఏదో తెలియని లోపం ఉంది. లేకపోతే నేనీ మృగాన్ని కామించి వుండను. జయలక్ష్మికి అపచారం చేసి నేను బావుకున్నదేమిటి? ఛీ!" అనుకున్నాడు శోభనాద్రి.

జయలక్ష్మిని గురించి ఇక జన్మలో స్మరించనయినా కూడదని అతను చేసుకున్న తీర్మానం ఆ రాత్రి పన్నెండు గంటలదాకా పని చేసింది. అతను పదింటికే నిద్రపోయినాడు. కాని పన్నెండు గంటలవేళ అతనికి కొట్టినట్టు మెళుకువొచ్చింది. నిద్ర లేస్తూనే అతను మంచం మీదినించి లేచి వెనకనించి తన్నెవరో తోస్తున్నట్టుగా జయలక్ష్మిని వెతుక్కుంటూ వెళ్లాడు. ఆమె మంచం దగ్గిరికి వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకుని గుంజాడు. జయలక్ష్మి కళ్ళు తెరచి చూసి "ఊఁహాఁ? ఏమిటీ పీడ!" అంటూ గొణుక్కుంది కాని లేచి వచ్చింది.

జయలక్ష్మి తిరిగి వెళ్ళిపోయి పడుకున్న తరువాత కూడా అతనికి నిద్ర పట్టలేదు. అతనిక ఆత్మ విమర్శ మానేశాడు, "ఏ షరతు మీదనైనాసరే నేనిటువంటి మనిషికోసం పాల్పడగలను! నా తాలూకు నగ్నసత్యం ఈ జయలక్ష్మే!" అనుకుని అతను సరిపెట్టుకున్నాడు.

ఆ మర్నాడు కూడా అతని ప్రణయం ఈ పద్ధతులమీదే నడిచింది.

ఈ రెండు రోజుల అనుభవంతోనూ అతనికి చాలా కొత్త విషయాలు గ్రహింపుకొచ్చినయి. జయలక్ష్మి సులభంగా లభ్యమవుతుందనే నమ్మకమే తన కామోద్రేకానికి ప్రధాన హేతువు. ఆమె మనస్సును జయిద్దామనే ఆశే తనను అంత నీచమైన షరతుల మీద ఆమెను స్వీకరించటానికి పురికొల్పింది. తను జయించలేదు. జయించటానికేమీ లేని దాన్నెట్లా జయించటం.....? జయలక్ష్మి చాలా గొప్పది. ఆమెతో పోయిన ప్రతి మగవాడూ ఈ షరతులమీదనే ఆమెతో పోయివుంటాడు. జయలక్ష్మి తన మీద ప్రకటించని అపేక్ష ఇంకోరి మీద ప్రకటించి ఉంటుందనుకోవటానికి ఏ ఆధారమూ లేదు. జయలక్ష్మి నీచపుదనుకోవటం దేనికీ? నీచత్వం ఏమన్నా వుంటే తనవంటి వాళ్ళలోనే వుంది.

"వెళ్ళొస్తాను బావా!" అన్నాడు శోభనాద్రి.

"కాస్త మీ చెల్లెకి పథ్యం పెట్టేదాకనన్నా వుండరా, ఏమైనా వైద్యుడివి గద!"

"కాదులే! అవతల క్లాసులు పోవటంలా? ఏమీ ఫర్వాలేదు. మీ వైద్యుడు గట్టివాడే. మళ్ళీ వారం పది రోజులలో వస్తాలే...."

రైల్లో కూచోగానే శోభనాద్రి బుర్రలో ఆలోచన మెరిసింది. వారఫలితాలు సుభద్ర కెట్లా పని చేసినట్టు? ...ఛీ! ఛీ! సుభద్ర అల్లాంటిది కాదు!... ఆ పినతల్లి మొగుడు - ఏమో! సుభద్రకేసి ఆకలిగా చూస్తాడనటానికి సందేహం లేదు. పెళ్లాంకూడా అందుబాట్లో లేదాయెను! అయినా జోస్యం ఏమిటి? దిక్కుమాలిన మూఢ నమ్మకాలు! డామిట్!... సుభద్రతో సూచనగా అనిచూస్తే ఆమెక్కూడా ఏమైనా జరిగిందీ లేందీ మొహాన తెలిసిపోతుంది!.... ఎట్లాగైనా సుభద్రను పెళ్ళాడతావా అని అడిగుండకపోవటం మేలే అయింది. అడిగుంటే వెనక్కు పీక్కోవటానికి వీలుండేది కాదు... చిత్రం, మనకు భావాలుండి కూడా చేతులతోనూ, మాటలతోనూ మాత్రమే జీవిస్తున్నాం. మనకు ఓ ఆడదాని మీద ఎంత కాంక్ష ఉన్నా, దాని మాటలూ, చేతలూ మినహాయించి ప్రకటించినంత కాలమూ ఆ ఆడది "ఎవడ్రా నువ్వు? చూడవే అమ్మా!" అని పొలికేక పెట్టలేదు... తను పెళ్ళి మాట ఎత్తకపోతే సుభద్ర తనను నమ్మించి మోసపుచ్చినట్లు రుజువు చెయ్యలేదు... అయినా తను సుభద్రను పెళ్లాడక పోవటంలో మోసమేముంది గనకా?.... తనవంటి అధముడు సుభద్రను పెళ్లాట్టానికి తగడు. సుభద్రకు తనకంటె ఎంతో మంచివాడు మొగుడగు గాక! తథాస్తు!...

***ముద్రణ: దుక్కిటెద్దు, కథల సంపుటి, 1955 - 59 మధ్య?***
***జయా పబ్లికేషన్స్, విజయవాడ***